## ఇందిరమ్మ ఇండ్ల పేర డబ్బుల దందా

**కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగయ్య సస్పెన్షన్**

మంగపేట, జూన్ 20 : మండలంలోని బుచ్చంపేటలో ఇందిరమ్మ ఇండ్ల పేర డబ్బుల దందా మొదలైంది. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేసిన వారిని కూడా వదలకుండా ఇందిరమ్మ ఇండ్లకు కమీషన్ ఇవ్వాల్సిందేనని వసూళ్లకు దిగడం న్యాయమేనా..? అని కాంగ్రెస్ పార్టీకి చెందిన పాడిపెల్లి రవి అనే వ్యక్తి ఫోన్ రికార్డు ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో ఆ పార్టీకి చెందిన మండల శాఖతోపాటు, సీనియర్ నాయకులు గ్రామస్థాయిలో ఇదేం లొల్లి అని తలలు పట్టుకునే పరిస్థితి ఏర్పడింది. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వద్ద ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్లు నిరూపించండి అని గత మూడు రోజుల క్రితమే సవాల్ విసిరిన కాంగ్రెస్ నాయకులకు బుచ్చంపేటలో ఇందిరమ్మ ఇండ్లకు డబ్బులు వసూళ్ల వ్యవహారం తలనొప్పిగా మారింది. ఇక్కడి కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడే లబ్ధిదారుల నుంచి డబ్బుల వసూళ్లకు పాల్పడుతున్నట్లు సోషల్ మీడియాలో ఫోన్ వాయిస్ రికార్డులు, వీడియోలు వైరల్ కావడం ఆ పార్టీ నాయకులను ఆయోమయానికి గురిచేసింది. తమకొచ్చిన ఇందిరమ్మ ఇంటికి డబ్బులు ఇవ్వలేమని, కాంగ్రెస్ పార్టీకి పని చేసిన మేము కూడా డబ్బులు ఇవ్వాలా? అన్న సంభాషణలు బహిరంగం కావడంతో చేసేదేమీ లేక బుచ్చంపేట కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కాటూరి నాగయ్యను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శుక్రవారం సాయంత్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ప్రకటించారు. బుచ్చంపేట గ్రామ విషయంలో సరే ఇంకా మిగతా గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల వ్యవహారంలో జరుగుతున్న అవకతవకలపై మండల కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా స్పందిస్తుందో చూడాలి మరి.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు


రెవెన్యూ సదస్సులో పాల్గొన్న అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

మొగుళ్లపల్లి, జూన్ 20 : భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు జయశంకర్ భూపాలపల్లి జిల్లా అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పిడిసిల్ల గ్రామంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సు ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అనంతరం ఇటీవల పిడిసిల్ల గ్రామంలోని రేషన్ షాపుపై పలు ఆరోపణలు రావడంతో డీఎస్‌ఓ శ్రీనాథ్‌తో కలిసి తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, గిర్దావర్ శివరామకృష్ణ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**ఒడితలలో పాల్గొన్న ఆర్డీవో రవి..**

చిట్యాల : రైతుల భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో రవి తెలిపారు. శుక్రవారం మండలంలోని ఒడితల గ్రామంలో చివరి రోజు నిర్వహించిన రెవెన్యూ గ్రామ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. భూ సమస్యల పరిష్కారానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**కాటారంలో వెల్లువెత్తిన దరఖాస్తులు..**

కాటారం, జూన్ 20 : మండలంలోని 31రెవెన్యూ గ్రామాల పరిధిలో భూ సమస్యలపై 2025 రెవెన్యూ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయడానికి నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై దరఖాస్తులు వెల్లువెత్తాయి. మండలవ్యాప్తంగా నిర్వహించిన సదస్సుల్లో 5,412దరఖాస్తులు రావడంతో వాటి పరిష్కారం ఎలా చేయాలో అని అధికారులు తలలు పట్టుకోవాల్సిన పరిస్థితి ఉంది. మండలంలోని రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ నెల 3వ తేదీ నుంచి నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులు శుక్రవారంతో ముగిశాయి. చివరి రోజున మండలంలోని సుందరాజపేట, విలాసాగర్ రెవెన్యూ గ్రామాల పరిధిలో సదస్సులు నిర్వహించారు. సుందరాజపేటలో 185, విలాసాగర్‌లో 471 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఈ సదస్సుల్లో తహసీల్దార్ నాగరాజు, నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్, ఆర్‌ఐ వెంకన్న, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డ్ అసిస్టెంట్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## కాళేశ్వరాలయంలో స్టేట్ కమిషనర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ రైట్స్ బోర్డ్ మెంబర్ పూజలు

మహదేవపూర్ (కాళేశ్వరం), జూన్ 20 : మండలంలోని కాళేశ్వరముక్తీశ్వర ఆలయంలో శుక్రవారం తెలంగాణ స్టేట్ కమిషనర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ రైట్స్ బోర్డ్ మెంబర్ వందన స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శుభానందదేవి ఆలయంలో అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అధికారులు ఆమెకు మర్యాదపూర్వక స్వాగతం పలికారు. పూజల అనంతరం ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

**WANTED**

★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

★ఉమ్మడి వరంగల్ జిల్లాలో 10th, ఇంటర్, డిగ్రీ పాసైనవారు అర్హులు. ఆకర్షణీయమైన జీతం రూం+భోజనం ఫ్రీ, ఇన్సెంటివ్స్ కలవు. సెల్: 7337378927, 7842425065.
NTW-337101

**CHANGE OF NAME**

I MOODIKE LAVANYA W/O MOODIKE SAMMAIAH(Late) R/o H.No. 9-65/2, Dubbapally, Chelpur(V), Ghanpur(M), Jayashankar Bhupalpally District, TG. I Declare that Myself MOODIKE LAVANYA alias MOODIKA LAVANYA is the one and the same person. for all future purposes.

**DOCUMENT MISSING**

I, MASHETTI PADMA W/O MASHETTI SURYA NARAYANA, R/o H.No.2-72, Chinnamadur village, of Devaruppula Mandal, Jangaon District, My OriginalSale Deed, vide document No.358/1998, dated 27-02-1998 SRO, Jangaon is lost. While travelling on 16-06-2025 Bus Journey from my village To Devaruppula. So can found it Please Call 9553999669.

**BUSINESS OFFER**

★Need Monthly Returns? Get your Own International Capital Market Trading Account. Profit Sharing/Fixed Returns, Safe & Secure. 6301859174.
NT-325295

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే

4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే

ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే

ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA 9182777563

WARANAGAL 9182777556

JAYASHANKAR BHUPALPALLY - 9182777135

MULUGU - 9182777135

MAHABUBABAD - 9182777557

JANGAON - 9182777565


# ‘అపార్’ నమోదులో ఆలస్యం

- ఈ సారైనా పూర్తయ్యేనా..?
- జిల్లాలో 47,565 మంది విద్యార్థులు
- ఇప్పటి వరకు 64శాతం పూర్తి
- ఇంకా నమోదు కానివారు 36శాతం
- ఆధార్‌కార్డులో తప్పులే ప్రధాన కారణం


భూపాలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

భూపాలపల్లి రూరల్, జూన్ 20 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 64శాతం మంది విద్యార్థులు మాత్రమే అపార్ ఐడీని కలిగి ఉన్నారు. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ఒక దేశం-ఒక విద్యార్థి ఐడీ నినాదంతో కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు ప్రత్యేకంగా అపార్ (ఆటోమెటెడ్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డు అమల్లోకి తీసుకొచ్చింది. గత సంవత్సరం దీనిపై విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రచారం చేసినా చాలా పాఠశాలలు పట్టించుకోలేదు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 36శాతం మంది విద్యార్థులు అపార్ నమోదుకు దూరంగా ఉండిపోయారు. ఈ నెల 12నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యాశాఖ అధికారులు మళ్లీ అపార్ నమోదుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు.

**జిల్లాలో మొత్తం 47,565 మంది విద్యార్థులు**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు 546 ఉండగా, వీటిలో 47,565 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. భూపాలపల్లి మండలంలో ఉన్న 95 పాఠశాలల్లో చదువుకుంటున్న 13,050 మంది విద్యార్థులకు 8,708 మంది అపార్ ఐడీని కలిగి ఉన్నారు. చిట్యాలో మండలంలోని 47పాఠశాలల్లో చదువుకుంటున్న 3,516 మంది విద్యార్థులకు 2,138 మంది, గణపురం మండలంలోని 42పాఠశాలల్లో చదువుకుంటున్న 5,597 మంది విద్యార్థులకు 4031మంది, కాటారం మండలంలోని 64పాఠశాలల్లో చదువుకుంటున్న 7,091 మంది విద్యార్థులకు 4031 మంది, కొత్తపెల్లి గోరి మండలంలోని 21 పాఠశాలల్లో 515మంది విద్యార్థులకు 407 మంది, మహదేవపూర్ మండలంలోని 53పాఠశాలల్లో చదువుకుంటున్న 5,022మంది విద్యార్థులకు 3,018 మంది, మల్హర్‌రావు మండలంలోని 47 పాఠశాలల్లో 2,807మంది విద్యార్థులకు 1,750మంది, మొగుళ్లపల్లి మండలంలోని 45 పాఠశాలల్లో చదువుకుంటున్న 3,068 మంది విద్యార్థులకు 2,093 మంది, మహాముత్తారం మండలంలోని 51పాఠశాలల్లో 2,487మంది విద్యార్థులకు 1,230 మంది, పలిమెల మండలంలోని 14పాఠశాలల్లో చదువుకుంటున్న 604 మంది విద్యార్థులకు 375మంది, రేగొండ మండలంలోని 33పాఠశాలల్లో చదువుకుంటున్న 2,188 మంది విద్యార్థులకు 1,574 మంది, టేకుమట్ల మండలంలోని 34 పాఠశాలల్లో చదువుకుంటున్న 1,620 మంది విద్యార్థులకు 935 మంది మాత్రమే అపార్ ఐడీ కలిగి ఉన్నారు.

**అపార్ నమోదుకు వెంటాడుతున్న సమస్యలు**

ఆధార్ తరహాలో దేశంలోని ఒక విద్యార్థికి 12అంకెలతో కూడిన అపార్ ఐడీ సంఖ్యను కేటాయించనున్నారు. ఇందులోనే విద్యార్థికి సంబంధించిన పేరు, పుట్టిన తేదీ, లింగం, ఫొటో, క్యూఆర్ కోడ్, కేజీ టూ పీజీ విద్యా సంవత్సరం వివరాలు, సాధించిన విజయాలు, స్కాలర్‌షిప్, మెమోలు, ధ్రువపత్రాలు, ఆధార్ అనుసంధానం ఉండటంతో కుటుంబ వివరాలు పొందుపరుస్తారు. స్కాన్ చేసిన వెంటనే పూర్తి వివరాలు తెలుస్తాయని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

ఆధార్ కార్డుల్లో విద్యార్థుల పేర్లు, చిరునామా, తల్లిదండ్రుల పేర్లు తప్పుగా ఉన్నవి వేల సంఖ్యలో ఉండటంతో నమోదు చేయడానికి ఇబ్బందిగా ఉందని, దీంతో వాటిని సరిచేసుకునేందుకు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరుగుతున్నా సమస్య తీరడం లేదని తల్లిదండ్రులు చెబుతున్నారు.

**త్వరగా పూర్తి చేస్తాం..**



జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల అపార్ నమోదును త్వరగా పూర్తి చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి. ఇప్పటి వరకు జిల్లాలో 30,560 మంది విద్యార్థులు అపార్ నమోదు చేసుకున్నారు. ఆధార్‌కార్డుల్లో తప్పులు ఉండడం వలన గత సంవత్సరం పూర్తి స్థాయిలో అపార్ నమోదు చేయలేకపోయాం. అపార్‌లో డీజీ లాకర్ ద్వారా విద్యార్థి వివరాలు నిక్షిప్తం కావడంతో భవిష్యత్‌లో అపార్ ఐడీ చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

*- ఎం రాజేందర్, జిల్లా విద్యాశాఖ అధికారి*

## ఎన్నికల హామీలు అమలు చేయాలి

**సొసైటీ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి**


పూర్ణచంద్రారెడ్డి

గణపురం, జూన్ 20 : ఎన్నికల హామీలో భాగంగా రైతు పండించిన వరి ధాన్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం బోనస్ ఇవ్వాలని సొసైటీ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అధికారంలోకి వచ్చిన తరువాత కాలయాపన చేస్తుందన్నారు. ఇప్పటికైనా రైతులు పండించిన అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని, ప్రతి రైతుకు రైతుభరోసా పథకం అమలు చేయాలన్నారు. లేదంటే రైతుల పక్షాన ధర్నా చేపడతామని హెచ్చరించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో అనేక కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బంది పెట్టారని, కొందరు రైతులకు ఇప్పటికీ ధాన్యం డబ్బులు ఖాతాలో జమ కాలేదన్నారు. జిల్లా యంత్రాంగం రైతులకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రైతులు వానకాలం సాగుకు సమాయత్తమవుతున్నారని, ఇప్పటికీ యూరియా అందుబాటులో లేదన్నారు. రైతులకు అవసరాలకు సరిపోయే విధంగా యూరియా సరఫరా చేయాలని ఆయన కోరారు.

## మట్టి నమూనా పరీక్షలు

కాటారం, జూన్ 20 : మండలంలోని వీరాపూర్ శివశంకర్ ప్రాజెక్ట్ చెరువును రిజర్వాయర్‌గా మార్చే ప్రక్రియలో భాగంగా చేపడుతున్న బండ్ పనులను అధికారులు శుక్రవారం పరిశీలించి మట్టి నమూనా పరీక్షలు చేయించారు. చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా శివశంకర్ ప్రాజెక్ట్ చెరువును రిజర్వాయర్‌గా మార్చడానికి 12ఏళ్ల క్రితం ప్రతిపాదించారు. కానీ పనులు జరగలేదు. ఇటీవల చిన్న కాళేశ్వరం పనులు వేగవంతమైన నేపథ్యంలో మూడేళ్ల క్రితం తెగిపోయిన చెరువును పునరుద్ధరించి కట్టను విస్తరించడం, మత్తడి తూముల నిర్మాణ పనులు చేపట్టారు. మెఘా సంస్థ పనులు చేయిస్తుండగా క్వాలిటీ కంట్రోల్, ఇరిగేషన్ అధికారులు ఫీల్డ్ డ్రై డెన్సిటీ, పార్టికల్ డెన్సిటీ తదితర పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈఈలు వెంకన్న, శిరీష క్యూసీ ఏఈ సంతోష్, మెఘా సంస్థ ఇంజినీర్ ఉన్నారు.

## ఈనెల 23న ఒలింపిక్ రన్

కృష్ణ కాలనీ, జూన్ 20 : అంతర్జాతీయ ఒలింపిక్ డేను పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈనెల 23న ఉదయం 6గంటలకు జిల్లా కేంద్రంలోని హనుమాన్ దేవాలయం నుంచి కృష్ణ కాలనీలోని అంబేద్కర్ స్టేడియం వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని క్రీడా సంఘాల సభ్యులు, క్రీడాకారులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ ఉపాధ్యాయులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రఘు కోరారు.

## నేటి యోగా వేడుకల్లో పాల్గొనాలి : కలెక్టర్

ములుగురూరల్, జూన్ 20 : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని గిరిజన భవనంలో నిర్వహిస్తున్న యోగా వేడుకల్లో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ టీఎస్ దివాకర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయూష్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 7నుంచి 8గంటల వరకు నిర్వహించే సామూహిక యోగా, మెడిటేషన్, కార్యక్రమాల్లో పాల్గొనాలని కలెక్టర్ టీఎస్ దివాకర సూచించారు.


ఆర్థిక సాయం అందిస్తున్న ట్రస్టు సభ్యులు

## మృతుడి కుటుంబానికి శ్రీరామకృష్ణ ట్రస్టు సాయం

మంగపేట, జూన్ 20 : మండల కేంద్రంలోని పొదుమూరుకు చెందిన బద్ది పాపారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని శుక్రవారం శ్రీరామకృష్ణ ట్రస్టు బృందం పరామర్శించింది. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ బాడిశ నాగరమేశ్ సమకూర్చిన రూ.4వేల విలువైన నిత్యావర సరుకులు, బియ్యం అందజేశారు. మానుపెల్లి వేణు, కలాల రాంబాబు, గుగ్గిల్ల సురేశ్, బద్ది రఘుబాబు, మానపల్లి రోహిత్, బద్ది సంతోష్ పాల్గొన్నారు.

## సరిహద్దులో మావోయిస్టుల బంద్ ప్రశాంతం


వెంకటాపురం(నూగూరు)లో మూసి ఉన్న దుకాణాలు

ములుగు, జూన్20(నమస్తేతెలంగాణ) : ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వ నిషేధిత మావోయిస్టు పార్టీ ఇచ్చిన బంద్ పిలుపు మేరకు ఏజెన్సీ ప్రాంతం నిర్మానుష్యంగా మారింది. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన ములుగు జిల్లాలోని వాజేడు, వెంకటాపురం(నూగూరు), కన్నాయిగూడెం, ఏటూరునాగారం మండలకేంద్రాలతోపాటు ఏజెన్సీ గ్రామాల్లో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను తుదముట్టిస్తున్న సందర్భంగా ఇచ్చిన బంద్ పిలుపుతో వ్యాపారస్తులు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి బంద్‌లో పాల్గొన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. మారుమూల ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులను ముందస్తుగా రద్దు చేశారు. ప్రైవేట్ వాహనాల ద్వారా రాకపోకలు కొనసాగించారు.

## మావోయిస్టు రవికి గ్రామగ్రామాన నివాళులు


అంబులెన్స్ వద్ద నివాళులర్పిస్తున్న చిట్యాల వాసులు

చిట్యాల, జూన్ 20 : మావోయిస్టు అగ్రనేత గాజర్ల రవి అలియాస్ గణేశ్, ఉదయ్ ఈనెల 18న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు మారేడుమిల్లి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా రంపచోడవరంలో పోస్టుమార్టం అనంతరం మృతదేహం అంబులెన్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున వెలిశాలకు చేరింది. కాగా మార్గమధ్యంలో మండలంలోని చల్లగరిగ, చిట్యాల కూడలిల వద్ద అభిమానులు, వివిధ పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు మృతదేహానికి నివాళులర్పించారు. శోకసంద్రంలో ఉన్న మృతుడి సోదరుడు గాజర్ల అశోక్ అలియాస్ ఐతును పరామర్శించారు. ఉద్యమ నినాదాలతో, జోహార్లు రవన్న అంటూ నినదించారు. అనంతరం పోస్టుమార్టం జరుగుతున్న తీరును, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ అశోక్ మాట్లాడారు. అనంతరం రవి స్వగ్రామమైన వెలిశాలకు అంతిమయాత్రకోసం వెళ్లారు.

## ఆదివాసీ హక్కులను కాపాడాలని కలెక్టర్‌కు వినతి

ములుగురూరల్, జూన్ 20 : ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీల హక్కులను కాపాడాలని కోరుతూ కలెక్టర్ టీఎస్ దివాకరకు శుక్రవారం ఆదివాసీ తుడుందెబ్బ, మాదిగ దండోర నాయకులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి చింత కృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ప్రకారం భూ భాగాన్ని కాపాడాల్సిన బాధ్యత ఐఏఎస్ అధికారులపై ఉంటుందని అన్నారు. ఏటూరునాగారం ఐటీడీఏ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న శివాపురం షెడ్యూల్ ఏరియాలో ఉన్న ఆదివాసీ భూములను గిరిజనేతరులు ఆక్రమించుకోవడాన్ని అరికట్టాలని అన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నెమలి నర్సయ్య, బొల్లం సారయ్య, స్వామి, జనార్దన్, రమేశ్, జగ్గారావు, భాగ్యలక్ష్మి, ముత్తయ్య, లావణ్య ఉన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన పెంచుకోవాలి


రైతులతో మాట్లాడుతున్న సంజీవరావు

గోవిందరావుపేట, జూన్ 20 : రైతులు ఆయిల్ పామ్ సాగు ప్రాముఖ్యతపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి దండు సంజీవరావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని రాంనగర్ గ్రామంలో ఆయిల్‌పామ్ పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఇందిర సౌర గిరి జల వికాసం పథకం ద్వారా ఆయిల్‌పామ్ తోటలకు సౌర విద్యుత్ మోటార్లు, డ్రిప్ పరికరాలతోపాటు ఆయిల్‌పామ్ మొక్కలను 100శాతం రాయితీతో పొందవచ్చునని సూచించారు. ఆసక్తిగల గిరిజన రైతులు ఐటీడీఏ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఆయన వెంట మండల హార్టికల్చర్ అధికారి శ్రీకాంత్, రైతులు ఉన్నారు.

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**జీపీ కార్యదర్శికి బీఆర్‌ఎస్ నాయకుల వినతి**

మహాముత్తారం, జూన్ 20 : స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గులు పోస్తూ కాంగ్రెస్ నాయకులు హడావుడి చేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు బొబ్బిలి వెంకటయ్య అన్నారు. మండలంలోని మాదారం గ్రామాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పైలట్ గ్రామంగా గుర్తించింది. మాదారం గ్రామం నుంచి ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు 266 కాగా, ప్రజాపాలన గ్రామ సభలో 146 మందికి ఇండ్లు మంజూరు అయినట్లు అధికారులు ప్రకటన చేసి వెళ్లిపోయారు. అప్పటి నుంచి గ్రామానికి రాని అధికారులు, కాంగ్రెస్ నాయకులు మండలంలో హడావుడి చేస్తున్నారని వెంకటయ్య అన్నారు. త్వరలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రానుండడమే ఇందుకు కారణమన్నారు. మాదారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు 87మంజూరు అయ్యాయని, గురువారం గుంటి మదనమ్మ-చంద్రయ్య ఒక ఇంటికి మాత్రమే ముగ్గు పోసి వెళ్లిపోయారని, గ్రామ సభలో ప్రకటించిన విధంగా అందరికి ఇండ్లు ఇవ్వాలని బొబ్బిలి వెంకటయ్య ఆధ్వర్యంలో నాయకులు జీపీ కార్యదర్శి కృష్ణవేణికి వినతి పత్రం అందజేశారు.

## వాహనదారులకు హెల్మెట్ శ్రీరామ రక్ష

**ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి**


హెల్మెట్ ధరించిన వాహనదారుడిని సన్మానిస్తున్న ఎస్సై

తాడ్వాయి, జూన్ 20 : ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ శ్రీరామరక్ష అని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని 163వ జాతీయ రహదారిపై రోడ్ సేఫ్టీపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ రహదారిపై హెల్మెట్ ధరించి వెళ్తున్న వాహనదారులను ఆపి వారిని పూల బొకేతో అభినందించి శాలువాతో సన్మానించారు. సుమారు 20మందికి సన్మానించి వారికి వాటర్ బాటిళ్లు బహుమతిగా అందజేశారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేశారు. కొండపర్తిని సందర్శించి పాఠశాల ఆవరణలో ఎస్సైతోపాటు గ్రామ యువకులు, సిబ్బంది స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో పీసీలు సాంబయ్య, రమేశ్ ఉన్నారు.

## సన్నబియ్యం పంపిణీ వంద శాతం పూర్తి

ములుగురూరల్, జూన్ 20 : ములుగు జిల్లాలో రేషన్‌కార్డుదారులకు ఒకే సారి మూడు నెలల సన్నబియ్యం పంపిణీ వందశాతం పూర్తయిందని అదనపు కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 222 రేషన్ షాపుల ద్వారా ఈ నెల 19వ తేదీ నాటికి కేవలం 19రోజుల్లో 5,218 మెట్రిక్ టన్నుల సన్నబియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేసి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉందని అన్నారు. సివిల్ సప్లయ్ అధికారులతోపాటు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వర్తించి రేషన్‌కార్డుదారులకు ఇబ్బందులు కలుగకుండా పంపిణీ చేశారని ఆయన వెల్లడించారు.


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ శబరీశ్

## పీఎస్‌ను తనిఖీ చేసిన ఎస్పీ

ములుగురూరల్, జూన్ 20 : ములుగు పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం జిల్లా ఎస్పీ డాక్టర్ పీ శబరీశ్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి విచారణలో ఉన్న కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ సిబ్బంది పనితీరును పరిశీలించి కేసుల వివరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. సైబర్ మోసగాళ్ల బారిన పడి ప్రజలు మోసపోకుండా అప్రమత్తం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలలో స్వాధీనం చేసుకున్న వాహనాలను యజమానులకు అందజేయాలని ఆదేశించారు. ఆయన వెంట డీఎస్పీ రవీందర్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శంకర్, సీఐ సురేశ్, ఎస్సైలు వెంకటేశ్వరరావు, మహేశ్, రామకృష్ణ, ఇతర సిబ్బంది ఉన్నారు.

## రైతు భరోసా రూ.75కోట్లు జమ

ములుగురూరల్, జూన్ 20 : రైతు భరోసా పథకంలో భాగంగా ములుగు జిల్లాలో 73,129మంది రైతుల ఖాతాల్లో రూ.75కోట్ల13 లక్షలు జమ చేసినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేశ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వానకాలం సీజన్‌లో ఎకరానికి రూ.6వేల చొప్పున 5ఎకరాలలోపు రైతులకు వారి ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. ఈ నగదును రైతులు నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**రైతు భరోసా నిధులు జమ**

భూపాలపల్లి రూరల్, జూన్ 20 : వానకాలం సాగును పురస్కరించుకొని జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతుల ఖాతాల్లో రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా నిధులు జమ చేసినట్లు కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. శుక్రవారం వరకు జిల్లా వ్యాప్తంగా 1,09,034 మంది రైతులకు రూ.114,43,75,762లు నేరుగా రైతుల ఖాతాలలో జమ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నిధుల ద్వారా సాగు పనులను వేగవంతం చేయడానికి రైతులు సన్నద్ధమవుతున్నారని ఆయన తెలిపారు.

## లక్నవరంలో అంతర్‌రాష్ట్ర కార్మికుడు మృతి

గోవిందరావుపేట, జూన్ 20 : పొట్టకూటి కోసం పని చేసేందుకు వచ్చిన అంతర్‌రాష్ట్ర కార్మికుడు మృతి చెందిన ఘటన మండలంలోని లక్నవరం సరస్సులో ఉన్న 3వ ఐలాండ్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి..ఉత్తరాఖండ్‌కు చెందిన హర్షపాల్‌సింగ్ ఏజె(40) 3వ ఐలాండ్‌లోని ప్రికౌట్స్ వర్కర్‌గా ఇటీవల వచ్చి పనులు చేస్తున్నాడు. గురువారం సాయంత్రం ఐలాండ్‌లో పనులు చేస్తుండగా అతనికి ఫోన్ వచ్చింది. మాట్లాడుకుంటూ గ్లాస్ ఉన్న కిటికీ నుంచి బయటకు వస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు గ్లాస్ అతని మర్మాంగంలో గుచ్చుకొని తీవ్రంగా గాయపడ్డాడు. ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలిస్తున్న క్రమంలో అదే రోజు రాత్రి మృతి చెందాడు. హర్షపాల్‌సింగ్ ఏజెతో కలిసి పని చేసే మణిందర్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అతడికి మృతదేహాన్ని అప్పగించారు.

## చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఏటూరునాగారం, జూన్ 20 : మండలంలోని చిన్నబోయినపల్లి-తాడ్వాయి మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బోడ ఫణికుమార్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఫణికుమార్‌ను గురువారం లారీ ఢీ కొట్టడంతో ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ములుగు ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

మల్లంపల్లి, జూన్ 20 : అనారోగ్యంతో మనస్తాపానికి గురై ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలకేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. ములుగు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపిన ప్రకారం.. మల్లంపల్లికి చెందిన రాకం మోహన్‌రావు(60) అనారోగ్యం కారణంగా 19వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించగా అదే రోజు మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

గోవిందరావుపేట, జూన్ 20 : మండలంలోని చల్వాయి గ్రామంలో బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండంలోని కోటగడ్డ గ్రామానికి చెందిన బండ బుచ్చిరెడ్డి చల్వాయిలోని కొటక్ మహేంద్ర బ్యాంకు వద్దకు వచ్చాడు. బ్యాంకులో పనులు ముగించుకొని పస్రా వైపు వెళ్తున్న క్రమంలో ములుగు నుంచి మణుగూరుకు వెళ్లే బస్సు ఢీకొనడంతో బుచ్చిరెడ్డికి కాలు, చేయి విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌కు తరలించినట్లు తెలిసింది.

## కుటుంబ గొడవల్లో ఒకరికి జైలు

కన్నాయిగూడెం, జూన్ 20 : బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన ఒకరికి కుటుంబ గొడవల కారణంగా రూ.5వేల జరిమానాతోపాటు 3నెలల జైలు శిక్ష పడినట్లు ఎస్సై వెంకటేశ్ శుక్రవారం తెలిపారు. 2022 సంవత్సరంలో తల్లిని చూసుకునేందుకు కుమ్మరి దుర్గయ్య, చిన వెంకటయ్యల మధ్య గొడవ జరిగింది. గొడవలో తమ్ముడు అన్నను కొట్టడంతో మనస్తాపానికి గురైన దుర్గయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదైంది. విచారణ పూర్తి కావడంతో కోర్టు శిక్ష విధించింది.

## గిరిజనులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

కన్నాయిగూడెం, జూన్ 20 : పోడు చేసుకున్నారని గిరిజనుల గుడిసెలను కూల్చి, 12 మందిపై కేసు నమోదు చేయడంపై బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు దుర్గం రాజ్‌కుమార్ తీవ్రంగా మండిపడ్డారు. శుక్రవారం రాజ్‌కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ ఏటూరునాగారం మండలం చల్పాక గ్రామంలో నిరుపేదలైన గిరిజనులను ఫారెస్ట్ అధికారులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. ఉండటానికి వేసుకున్న గుడిసెలను తొలగించడం మానుకోవాలని, వారిపై పెట్టిన కేసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాజేశ్, మురళి, రాజు ఉన్నారు.

## ఫర్టిలైజర్ షాపుపై దాడులు

మొగుళ్లపల్లి, జూన్ 20 : కొంతకాలంగా నిషేధిత కలుపు నివారణ మందు విక్రయాలు జరుగుతున్నాయనే పక్కా సమాచారంతో వ్యవసాయ, పోలీస్ శాఖలు సంయుక్తంగా మండల కేంద్రంలోని వినాయక ఆగ్రో ఏజెన్సీపై శుక్రవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా రూ.36వేల విలువ చేసే 40బాటిల్స్ నిషేధిత కలుపు మందు పట్టుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. కాగా, వినాయక ఆగ్రో ఏజెన్సీ ఫర్టిలైజర్ షాపు యజమాని ఇరుపాల రాజేశ్వరావు కలుపు నివారణ మందును పెద్ద మొత్తంలో టేకుమట్ల మండల కేంద్రానికి చెందిన అంబాల పైడయ్య వద్ద కొనుగోలు చేసినట్టు వ్యవసాయశాఖ అధికారులు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరుపాల రాజేశ్వరావుతోపాటు అంబాల పైడయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి

ములుగురూరల్, జూన్ 20 : మాదక ద్రవ్యాల నిర్మూలనకు అధికారులు కృషి చేయాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. శుక్రవారం ఆయన అధికారులతో నశా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమ లక్ష్యాలను వివరించి జిల్లాను మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు వారం రోజులపాటు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.